క్లుప్తంగా

అందుబాటులో జీలుగ విత్తనాలు

భూత్పూర్: సింగిల్ విండో ద్వారా రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు ఏఈవో హర్ష ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 30 కేజీల బ్యాగు రూ.1,116 ఉంటుందని, రెండున్నర ఎకరాలకు సరిపోతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకంతోపాటు ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని ఏఈఓ హర్ష తెలిపారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 47వ వార్డు పరిధిలోని వివేకానంద నగర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను శనివారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సి.గోవిందు, కాలనీ వాసులు ఆర్.వి.స్వామి, విజయకుమార్, రవీందర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, శారద తదితరులు పాల్గొన్నారు.

నీరు నిలవడంతో ఇబ్బందులు



హన్వాడ: మండల పరిధిలోని ఏనెమీదితండాలో నూతనంగా సీసీదారులు నిర్మించినా ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు చెబుతున్నారు. గ్రామానికి వెళ్లే చౌరస్తాలోనే రోడ్డును సరిగా నిర్మించక పోవడంతో నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. వర్షం కురిసినప్పుడు నీరు వెళ్లే వీలు లేకుండా నిర్మాణం చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. ఇళ్ల మధ్య నీరు నిల్వ ఉంటే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా సర్వీస్ రోడ్డు



అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. కొన్నాళ్ల కిందట సర్వీస్ రోడ్డుపై బీటీ వేయించి వేయించారు. పాత పెట్రోల్ పంపు ఎదురుగా రైస్ మిల్లు పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు వద్ద కల్వర్టుకు ఒకవైపు మాత్రమే రక్షణ గోడ ఉంది. మరో వైపు రక్షణ గోడ లేదు. ఇక్కడ జాతీయ రహదారిపై మూసాపేట వైపు నుంచి జానంపేట ఊర్లోకి సర్వీస్ రోడ్డుపై మళ్లే వాహనాలకు రక్షణ గోడ లేని కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. రాత్రివేళ ద్విచక్రవాహనాలు, ఆటోలు కల్వర్టు వద్ద ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. హైవేను దిగి వచ్చే సమయంలో డ్రైవర్లు ఏమాత్రం అజాగ్రత్త వహించినా కల్వర్టులో పడిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా రహదారి నిర్వాహకులు స్పందించి కల్వర్టు వద్ద రక్షణ గోడ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

సంతాపం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రామోజీరావు మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతిచేకురాలని ఆకాంక్షించారు. కుటుంసభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

కాంగ్రెస్ గెలుపుపై హర్షం

కోయిల్‌కొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్‌మల్లన్న విజయం సాధించడంతో శనివారం మండలకేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షుడు జి.రవీందర్, రామునాయక్, బండియాదవ్‌కుమార్, మహేందర్‌నాయక్, నాగరాజు, రామస్వామి, మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మల్లయ్యగౌడ్, నరేష్, వెంకటేష్, విఠల్, బుగ్గయ్య, ధోనియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తూముల మరమ్మతు చేయరా?

- లీకేజీలు ఉండడం, వర్షాలు పడుతుండడంతో రైతుల ఆందోళన



వెన్నాచేడ్ పెద్ద చెరువు



దెబ్బతిన్న పెద్ద చెరువుతూము

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్ చెరువు తూములకు త్వరిత గతిన మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు. ఏమాత్రం వర్షపు నీరు వచ్చి చేరినా రిపేర్లు చేయడం వీలుకాదని అంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుడడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలో వెన్నచేడ్ చెరువే పెద్దది. దీనికింద 475 ఎకరాల ఆయకట్టు అధికారింగా ఉండగా.. దాదాపు వెయ్యి ఎకరాల వరకు పారుతుంది. దీంతో వివిధ గ్రామాల రైతులు దీనిపై ఆధారపడుతున్నారు. జక్లపల్లి, లింగాయిపల్లి, జానంపల్లి, వెన్నాచేడ్ తదితర గ్రామాలకు చెందిన పంటపొలాలకు ఈచెరువు ద్వారా సాగునీరు అందుతుంది. దాదాపు రెండు వందల ఏళ్ల క్రితం నిర్మితమైన ఈ చెరువుకు ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందడం లేదు. ఈ చెరువుకు రెండు తూములు ఉన్నాయి. రెండింటి నుంచి కూడా నీరు లీకవుతుంది. ఎప్పుడూ ఈ రెండు తూముల నుంచి మూడు నాలుగు మోటర్ల నీరు వృథాగా పోతుంది. దీంతో తుకాలు కట్టక ముందే నాలుగైదు ఫీట్ల నీరు తగ్గిపోతున్నది. చిన్న తూము గతంలో మరమ్మతు చేసినా తిరిగి అదే పరిస్థితి నెలకొంది. లీకేజీ ఎక్కడ ఉందో అధికారులు సైతం గుర్తించలేకపోయారు. అప్పట్లో షెట్టర్ మార్చడంతో పాటు తూమును కూడా మరమ్మతు చేశారు. అయినా పరిస్థితిలో ఏమార్పు లేదు. పెద్ద తూము నుంచి నీరు లీకవుతున్నది. కాగా తూములకు మరమ్మతు చేయడం అత్యంత అవశ్యకమని రైతులు అంటున్నారు. ప్రస్తుతం షెట్టర్ పక్కన చిన్న చిన్న రంధ్రాలు పడ్డట్టు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. దీంతో పాటు షెట్టర్ రెండు వైపుల కొద్దిగా లేచి ఉంది. ప్రస్తుతం నాలుగైదు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. దీంతో చెరువులోకి నీరు చేరే అవకాశం ఉంది. ఏమాత్రం నీరు వచ్చినా పెద్ద తూము షెట్టర్ రిపేరు చేయడం సాధ్యం కాదు. అది చేయకపోతే చెరువు నిండిన పంట పొలాలకు నీరు ఇవ్వడం సాధ్యం కాదు. కాగా నెలరోజులుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వచ్చి చూశారే తప్ప ఇంతవరకు మరమ్మతు పనులు చేపట్టడం లేదని రైతులు వాపోతున్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మరమ్మతు చేయాలని ఆదేశించాం..

వెన్నాచేడ్ పెద్ద చెరువు తూముల సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. మా జేఈ ఇతర సిబ్బంది వెళ్లి చూసి వచ్చారు. వాటిని తక్షణమే మరమ్మతు చేయాలని ఆదేశించాం. వెంటనే చేయించి నీరు వృథాపోకుండా చూస్తాం.

– రేణుక, ఈఈ, ఇరిగేషన్ చెవెళ్ల డివిజన్

రాష్ట్ర సదస్సును జయప్రదం చేద్దాం



ఉపాధికూలీలతో సదస్సు కరపత్రాలు ఆవిష్కరణ

జడ్చర్ల టౌన్: హైదరాబాద్‌లో ఈనెల 10న జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు జగన్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఆలూర్, కిష్టంపల్లి, చర్లపల్లి, మాచారం గ్రామాల్లో ఆయన ఉపాధి కేంద్రాలకు వెళ్లి కూలీలను కలుసుకుని మాట్లాడారు. కూలీలతో కలసి సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. సదస్సుకు హాజరు కావాలని, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలను కోరారు. అలాగే సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని, ప్రస్తుతం విధుల్లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నర్సింహులు, బాలచంద్రయ్య, యాదయ్య, శివనీల, మంగమ్మ, అలివేల, లలిత, కమలమ్మ, మల్లేష్, సత్యమ్మ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రామ్మోహన్

భూత్పూర్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు జిల్లా లేబర్ అధికారులు పరిష్కరించడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రామ్మోహన్ ఆరోపించారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్స్ చాలా పెండింగ్‌లో ఉన్నాయని, కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలకు ఆర్థికసాయం అందక భార్య, పిల్లలు వీధిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించాలన్నారు. భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, నర్సింహులు, లక్ష్మణ్ నాయక్, అంజి, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

పాఠశాలలకు దుస్తులు, పుస్తకాల సరఫరా



యూనిఫాంలు అందజేస్తున్న ఎంఈఓ మంజులాదేవి



దేవరకద్రలో..

జడ్చర్ల టౌన్/మిడ్జిల్: జడ్చర్ల మండల మహిళాసమాఖ్య కార్యాలయంలో శనివారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ మంజులాదేవి పంపిణీ చేశారు. నిర్ణయించిన తేదీల ప్రకారం ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా యూనిఫాంలు తీసుకువెళ్లాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం మాల్యానాయక్, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు జడ్చర్ల పాఠశాలలో పుస్తకాలు అందజేశారు. మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం సజావుగా సాగుతుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్‌ల సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. మిడ్జిల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన ఏకరూప దుస్తులను, పాఠ్య పుస్తకాలను శనివారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద హెచ్ఎంలకు ఎంఈఓ మంజులాదేవి అందజేశారు.

దేవరకద్ర: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు శనివారం పాఠ్యపుస్తకాలు, నోటు బుక్‌లను శనివారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు పుస్తకాలను అందజేశారు. అలాగే ఆయా పాఠశాలలో చదివే విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. మండలానికి 22, 250 పాఠ్యపుస్తకాలు (దాదాపు 90 శాతం) వచ్చాయని మండల అధికారులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం కేసునమోదు

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్లకి చెందిన నాగరాజు రెండు రోజుల క్రితం అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. నాగరాజు గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్‌లో క్యాషీయర్‌గా పనిచేస్తున్నారు. కాగా అదే గ్రామానికి చెందిన రంగనాథ్ కొన్ని రోజుల నుంచి నాగరాజ్‌తో తరుచూ గొడవ పడుతున్నాడని, ఈ నెల 6న మళ్లీ గొడవపడటంతో మనస్తాపానికి గురై శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడని ఎస్ఐ వివరించారు. నాగరాజు తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన జంగం గోపన్న అనారోగ్యానికి గురై మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని శనివారం బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించారు. గోపన్న మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

చిన్నచింతకుంట: గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేస్తున్న కొకుంట్ల కుర్మన్న కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా తోటి సిబ్బంది బాధిత కుటుంబానికి రూ.13 వేల ఆర్థికసాయాన్ని శనివారం అందించారు. భవిష్యత్‌లోనూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.





చేపలకు డిమాండ్

మృగశిర కార్తెను పురస్కరించుకుని జిల్లాకేంద్రంలో శనివారం చేపలకు డిమాండ్ పెరిగింది. చేపల విక్రయ కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. దీంతో సాధారణ రోజులతో పోల్చితే వ్యాపారులు చేపలను అధికధరలకు విక్రయించారు. కాగా మృగశిర కార్తె రోజున చేపల తినడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే జిల్లావాసులు వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరిచారు.

– మహబూబ్‌నగర్ వ్యవసాయం

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు



దేవరకద్ర: మండల కేంద్రం నుంచి బస్వాయపల్లి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. ఇటీవల వరుసగా వర్షాలు పడుతుండడంతో ఉపాధి హామీ పథకం కింద గుంతలు తీసి కార్యక్రమం చేపట్టారు. కాగా ఇందులో భాగంగా ఇప్పటికే దేవరకద్ర నర్సరీలో సిద్ధం చేసిన మొక్కలను అవసరమున్న చోట నాటుతున్నట్లు వివరించారు.

సబ్సిడీ విత్తనాలు ఇక లేనట్లేనా?

- జీలుగ, జనుము విత్తనాలకు మాత్రమే పరిమితమైన వైనం



రాజాపూర్ మండలంలోని రైతు ఆగ్రోస్ కేంద్రం

రాజాపూర్: రైతులను సాగు దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన సబ్సిడీపై విత్తనాల అందజేత ఇక లేనట్లే కనిపిస్తోంది. ప్రస్తుతం జీలుగ, జనుము వంటి భూసారం పెంచే వాటిని మాత్రమే సబ్సిడీపై అందజేస్తూ మమా అనిపిస్తున్నారు. అవికూడా కొన్నిచోట్లు పూర్తిస్థాయిలో అందించడంలో విఫలమవుతుండడం గమనార్హం. పరిస్థితి ఇలాగా కొనసాగితే వ్యవసాయాన్ని నీరుగార్చడమే అవుతుందని పలువురు వాపోతున్నారు. గతంలె రైతులకు ఏకకాలంలో రూ. లక్ష రుణమాఫీ చేయడంతో పాటు సబ్సిడీ విత్తనాలు, ట్రాక్టర్‌లు, వాటి ఇప్లిమెంట్స్‌ను ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం ఆయా కంపెనీల వారు నిర్ణయించిన ధరకు సాగు విత్తనాలు కొనుగోలు చేయక తప్పడం లేదని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండల పరిధిలోని అగ్రోసేవా కేంద్రాలు తదితర చోట్లు కేవలం భూసారం పెంచే విత్తనాలే పంపిణీ చేస్తున్నారని చెబుతున్నారు. దీంతో సాగు ఖర్చులు అధికమవుతున్నాయని.. అప్పులు తీసుకురావల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని అంటున్నారు. ప్రభుత్వం దృష్టిసారించి సబ్సిడీపై గతంలో మాదిరిగా విత్తనాలు అందిస్తే బాగుంటుందని చెబుతున్నారు.

మామిడి చేద్దామనుకున్నా..

గతంలో పండ్లతోటల పెంపకానికి, పాడి రైతులకు బ్యాంకు లింకేజీల ద్వారా సబ్సిడీలు ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం ఆయిల్‌ఫాంకి మాత్రమే సబ్సిడీ ఇస్తున్నారు. నేను మామిడితోట సాగు చేయాలని అనుకున్నా.. ఎలాంటి సహకారమూ లేదు. ప్రభుత్వం మాలాంటి వారిని ప్రోత్సహిస్తే బాగుంటుంది.

– సేవకుల వెంకట్‌రాజు, మల్లేపల్లి రైతు

అప్పు తప్పడం లేదు..



రైతులకు ఎరువులు, విత్తనాలైనా సబ్సిడీపై ఇస్తే బాగుంటుంది. అదునైనప్పుడు విత్తనాలు, ఎరువులు తెచ్చుకుందామంటే చేతుల్లో డబ్బులు లేకపోవడంతో ఇబ్బంది పడాల్సివస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో అప్పు చేయాల్సి వస్తోంది. రైతుకు అండగా ఉంటామని సర్కారోళ్లు చెబుతారు కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ఎర్రన్న, రైతు, రాయపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

ప్రస్తుతం రైతులు తమ పొలాల్లో భూసారం వృద్ధి చెందించేందుకు పచ్చిరొట్ట ఎరువులను వాడే విధంగా జీలుగ, జనుము విత్తనాలు మాత్రం ప్రస్తుతం రాజాపూర్‌లో రైతు ఆగ్రోస్‌లో అందుబాటులో ఉన్నాయి. గతంలో సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు వచ్చేవి ప్రస్తుతం ఎలాంటి ఆదేశాలు లేవు. రైతులు సబ్సిడీ విత్తనాలు అడుగుతున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసువెళ్తాం.

– జాలరి నరేందర్, మండల వ్యవసాయశాఖ అధికారి



మృగశిర కార్తె వేళ..పొలాలు కళకళ..

మృగశిర కార్తె వేళ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పొలాలు రైతులు, కూలీలతో కళకళలాడాయి. కొన్నిచోట్ల ముందస్తుగా పొలాలను సిద్ధం చేయడం రైతులు దుక్కులు దున్నించారు. మరికొందరు పొలాల్లో విత్తనాలు వేయటం చేపట్టారు. ఈ క్రమంలో కాగా ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది.

– నవాబుపేట


ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



రుసుంపల్లిలో..



కొత్తపేటలో..



రాంచంద్రాపూర్‌లో..

భూత్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. బడి బాటలో కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.

హన్వాడ: మండల పరిధిలోని కొత్తపేట క్లస్టర్‌లో ఏనమిదితండా, కొత్తతండా, సూర్యనాయక్‌తండాల్లో శనివారం బడిబాట నిర్వహించారు. కొత్తపేట జీహెచ్ఎం ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: లింగంపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వసతులు, విద్యార్థులకు అందించే పుస్తకాలు, తదిత వాటిని గురించి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బ్రోచర్లు అందజేశారు. హెచ్ఎం ప్రసాద్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, ఆంజనేయులు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: బడి బయటి పిల్లలను తల్లిదండ్రులు తప్పకుండా సర్కారు బడికే పంపాలని మండల విద్యాధికారి ఎన్.నాగయ్య అన్నారు. మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో శనివారం జరిగిన ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ చెన్నయ్య, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

గండేడ్: రుసుంపల్లి, జంగంరెడ్డిపల్లి, సల్కర్‌పేట్, వెన్నాచేడ్, లింగాయిపల్లి, రంగారెడ్డిపల్లి, కొండెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులను ప్రభుత్వ బడులకే పంపించాలని కోరారు.



లింగంపల్లిలో బ్రోచర్లు అందిస్తున్న ఉపాధ్యాయులు



ఎల్కిచర్లలో..

సేవారత్న అవార్డు

స్టేషన్ మహబూబ్‌నగర్: గత పదేళ్లుగా చేస్తున్న సేవలకు గానూ అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితికి జిల్లాకు చెందిన శ్రీకరి ఫౌండేషన్ తరఫున ఛత్రపతి శివాజీ సేవారత్న అవార్డును ప్రకటించారు. కాగా శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ ఈ మేరకు అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో శ్రీకరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్యాం సుందర్, లక్ష్మణ్‌గౌడ్, రాంచందర్, సతీష్, రామేశ్వర్, బాలప్రసాద్, రాములు, కొండల్, శివకుమార్, సుబ్రమణ్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

దేవరకద్ర: గోపన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కుమార్ అనారోగ్యంతో శనివారం మృతి చెందడంతో పలువురు నాయకులు గ్రామానికి వెళ్లి ఘనంగా నివాళి అర్పించారు. కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.